క్లుప్తంగా

6న ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో ఈ నెల 6వ తేదీన ఉచిత ఆర్థరైటిస్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రిలో ఇప్పటివరకు 50కిపైగా మోకాళ్ల మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు పేర్కొన్నారు. చేవెళ్ల ప్రాంతంలోని ప్రజలతో పాటు చుట్టూ పక్కన ఉన్న ఇతర ప్రాంతాల ప్రజలు సైతం ఎవరైనా ఈ వైద్యసేవలను పొందవచ్చని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్తమైసమ్మ ఆలయంలో పూజలు



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న యువకులు

మొయినాబాద్‌రూరల్: భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్న అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయాన్ని గత వారం రోజుల క్రితం ప్రారంభించగా.. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ యూత్ నాయకులు ప్రతి ఆదివారం రోజు అమ్మవారికి నైవేద్యం సమర్పించి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది.

ఆయుర్వేద చికిత్సాలయం ప్రారంభం



చికిత్సాలయాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు తదితరులు

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషులకు ఆయుర్వేదం ద్వారా దీర్ఘకాలికంగా ఇబ్బందులు పెడుతున్న రోగాలన్నింటికీ చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. ఈ చికిత్సాలయం ప్రతి నెల మొదటి, మూడో ఆదివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోస్ట్ గార్డ్ రిటైర్డ్ డీఐజీ అమరేందర్‌రెడ్డి, శంకర్‌పల్లివాసులు వాసుదేవ్‌కన్నా, దయాకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శ్రీను, సురేశ్, కృష్ణయ్య, శోభ పాల్గొన్నారు.

పంటకు చీరే రక్షణ



మొక్కజొన్న పంట చుట్టూ కట్టిన చీరలు

షాబాద్: పంటలను రక్షించుకునేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. విత్తనం నాటినప్పటి నుంచి దిగుబడి చేతికందే వరకు పంటను కంటికిరెప్పలా కాపాడుకుంటారు. ఓ రైతు షాబాద్ మండలం రేగడిదోస్వాడ గ్రామ సమీపంలో మొక్కజొన్న పంటను పందుల బారి నుంచి రక్షించుకునేందుకు ఓ రైతు ఇలా పంట చుట్టూ కట్టిన చీరలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. తెల్లవారుజామున ఆలయంలో శివపార్వతులకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ, మంత్ర పుష్పం పలు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు చివరిరోజు కావడంతో తెల్లవారుజామున దోపోత్సవం నిర్వహించి విగ్రహాలను పల్లకీసేవలో ఊరేగించారు. శివగంగలో గుమ్మడికాయ కొట్టి దిష్టి తీసి శివపార్వతుల విగ్రహాలను ఊరేగింపు చేసి ఆలయంలో ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ ఈఓ మురళీకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలతో పాటు, పలు శాఖల అధికారులను ఆలయ చైర్మన్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు మోదిని రాకేశ్, ఒగ్గు శంకర్, పెయ్యల సువర్ణ, పోతర్ల తిరుపతయ్య, గద్దగూటి నరేశ్, ఏపూరి సాయిలు, కనగట్ల శ్రీశైలం, ఆలయ ఈఓ మురళీకృష్ణ, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు!

- శిలాఫలకాలకే పరిమితమైన ముర్తుజాగూడ-మొయినాబాద్ రోడ్డు
- మంజూరైన నిధులు ఇతర పనులకు మళ్లింపు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్‌రూరల్: అధ్వానంగా ముర్తుజాగూడ-మొయినాబాద్ రోడ్డు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గుంతలతో దర్శనమిస్తున్న రోడ్లపై ప్రయాణిస్తూ నరకయాతన పడుతున్నారు. రాత్రి వేళల్లో చాలా మంది ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలు..

మండల పరిధిలోని ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ మండల కేంద్రానికి వెళ్లే ఈ రోడ్డు దాదాపు రెండున్నర కిలోమీటర్లు. ఈ రోడ్డుకు రెండుసార్లు నిధులు మంజూరుచేసి శిలాఫలకాలు వేశారు. ప్రస్తుతం అవి దిష్టిబొమ్మల్లా నిలిచాయి. 2004లో



2023లో రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ఈ రోడ్డుకు బీటీ వేయాలని నిధులు మంజూరు చేసి, పనులకు శంకుస్థాపన చేశారు. కానీ అప్పట్లో కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఆ నిధులు వేరు పనులకు మళ్లించారు. రోడ్డు అధ్వానంగా ఉందని, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మొరపెట్టుకోవడంతో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ ఛాలెంజర్ స్కూల్ వరకు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఆర్‌ఆర్ నిధులు అంచనా రూ.1.45 కోట్లు మంజూరు చేయించి 2023 సెప్టెంబర్ 7వ తేదీన శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు పనులు ముందుకుసాగలేదు.

వాహనదారులకు తిప్పలు

ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక ప్రమాదాల బారినపడి అనేక మంది ఆస్పత్రుల పాలైన సంఘటనలు నెలకొన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బాకారం, కాశీంబౌలి, అమ్డాపూర్, నదీమ్‌నగర్, ముర్తుజాగూడ గ్రామాలతో పాటు శంషాబాద్ మండలం నుంచి వచ్చే ప్రయాణికులు ఈ రోడ్డుపైనే మొయినాబాద్‌కు వెళ్తారు. ఇది లింకురోడ్డు కావడంతో చాలా మంది ఈ దారి గుండానే ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలి



ముర్తుజాగూడ-మొయినాబాద్ రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారింది. మండల కేంద్రానికి వెళ్లడానికి అతితక్కువ దూరం కావడంతో ప్రయాణికులు ఈ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి రెండు సార్లు నిధులు మంజూరైన పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– పాలమాకుల లక్ష్మణ్‌యాదవ్, ముర్తుజాగూడ గ్రామస్తుడు

కాంట్రాక్టర్ ముందుకు రాలేదు



ముర్తుజాగూడ-మొయినాబాద్ రోడ్డు నిర్మాణానికి 2023 సంవత్సరంలో అప్పటి ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. అప్పట్లో టెండర్లు వేయగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిధులు నిలిచిపోయాయి. ఆ నిధులు ప్రస్తుతం లేవు. మళ్లీ కొత్త నిధులు వస్తేనే రోడ్డు పనులు జరుగుతాయి.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

గ్రామ అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్ తదితరులు

మాజీ సర్పంచ్ ముత్తంగి రాజశేఖర్

చేవెళ్ల: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఈర్లపల్లి మాజీ సర్పంచ్ ముత్తంగి రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో ఆదివారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలు, ఎస్‌డీఎఫ్ రూ.5లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో గ్రామాభివృద్ధికి అధిక నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామంలోని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పదవులు ఉన్నా లేకపోయినా నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మున్నూరు నర్సింలు, నాయకులు శ్రీనివాస్, శివకుమార్, రాఘవేందర్, సురేందర్, శ్రీనివాస్, సురేశ్, ప్రసాద్, శ్రీహరి, శ్రీనివాస్, రామస్వామి, బాస్కర్, అనంత్‌రెడ్డి, రాజేశ్, షకీర్ ఖాజా, భిక్షపతి, పరమేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కందుకూరు: స్వాతంత్య్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్ విమర్శించారు. సీపీఎం పార్టీ పిలుపుమేరకు ఆదివారం మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. 2006 తర్వాత మళ్లీ ఇంతవరకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. అర్హులైన వృద్ధులకు పింఛన్లు అందడం లేదన్నారు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ అయిన నేదునూరును విస్మరించడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ప్రజల వెంట ఉండి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు బి.శ్రీనివాస్, ఎ.కుమార్, గ్రామ కార్యదర్శి ఎం.యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు


ఎస్‌ఐ వనం శిరీష

చేవెళ్ల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఎస్‌ఐ వనం శిరీష అన్నారు. మండలంలోని అంతారం గ్రామంలో ఆదివారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉండే పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ వైద్యశిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామానికి చెందిన యువ నాయకులు వెంకటేశ్‌బాబు, తరుణ్ తదితరులు ప్రత్యేక చొరవ తీసుకొని వైద్యశిబిరాలు ఏర్పాటు చేయటంపై వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుల బృందం, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎస్‌ఐ శిరీష

మాదిగ అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: ఎమ్మార్పీఎస్ ఉద్యమ సమయంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వమని ఎమ్మార్పీఎస్ జల్‌పల్లి గ్రామ కమిటీ నాయకుడు యంజాల శివకుమార్ అన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి జల్‌పల్లి గ్రామంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 ఏళ్ల పాటు చేసిన ఉద్యమంలో ఎంతో మంది తమ ప్రాణత్యాగాలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణతో వారి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహ, రామారావు, యాదగిరి, మహేందర్, జంగయ్య, దానయ్య, జగన్, జ్ఞానేశ్వర్, శ్రీనాథ్, బాలకృష్ణ, అశ్విన్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం భగవద్గీత

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షురాలు సద్గుణ



వేములనర్వలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

కేశంపేట: భగవద్గీత సృష్టికి మూలమని, ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక షాద్‌నగర్ కమిటీ అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. పాల్గుణ మాసం ప్రారంభం సందర్భంగా మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక షాద్‌నగర్ కమిటీ అధ్వర్యంలో భగవద్గీతపైన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సద్గుణ మాట్లాడుతూ.. పాల్గుణ మాసంలో వచ్చే హోళీ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. పండుగ అంటే మనిషి జ్ఞానిగా మారడమని, పండుగ రోజు పనులను వదిలేసి దేవుడి గురించి తెలుసుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేశారన్నారు. గీతోపదేశం పొందిన అర్జునుడు ఫల్గుణుడిగా మారాడన్నారు. యోగి ప్రబోదానంద యోగ పీఠం శ్రీశ్రీశ్రీ ఆచార్య యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను గ్రామంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ కమిటీ సభ్యులు శోభ, వాసంతి, నవ్య, గౌతమి, స్వాతి, కుల్దీప్ రెడ్డి, ఆనంద్, సుదీర్, ధన్వంతరి, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఆదివారం స్లాబ్ చేశారు. ఈ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కూడిన కళాశాలను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కళాశాల నిర్మాణానికి దాతలు తోడ్పాటు అందించడం హర్షణీయమన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని మరిచిపోలేనిదని, వారి పేరు ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

విరాళం అందజేత

మండల పరిధిలోని మొత్కులగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెట్ట మహేందర్ ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి రూ.40వేల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, దంగు శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, పల్లె ఆనంద్, ఖదీర్, భాస్కర్, అశోక్, దేవగిరి నవీన్, బచ్చలి నరేశ్, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవకు కృషి చేయాలి



ఆలయ కమిటీ సభ్యులకు కెమెరాలను అందజేస్తున్న దయానంద్‌గుప్తా

కాంగ్రెస్ నేత దయానంద్‌గుప్తా

కొత్తూరు: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నేత దయానంద్‌గుప్తా కోరారు. మండలంలోని గూడూరు గ్రామంలో గల హనుమాన్, పోచమ్మ, మైసమ్మ ఆలయాల్లో ఆదివారం ఆయన సొంత డబ్బులు సుమారు రూ.40వేలు వెచ్చించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం కోసం పాటుపడాలన్నారు. అన్ని కులాలు, మతాలను గౌరవించాలని సూచించారు. ఆధ్యాత్మికత అలవర్చుకునేవారు సాటివారి పట్ల ప్రేమానురాగాలతో వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల రిజర్వేషన్లు పెంచాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: రాష్ట్రంలో ఎస్సీల రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల కులగణన ప్రకారం ఎస్సీల జనాభా 18 శాతం ఉందని గుర్తించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో, చేవెళ్లలో జరిగిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఎస్సీల రిజర్వేషన్ పెంచిన తర్వాతే వర్గీకరణ చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే వర్గీకరణ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు అంటరానితనం ఆధారంగా వచ్చాయని, జనాభా ధమాషా, ఆర్థిక, పేదరికంతో రాలేదని దళిత సమాజం గుర్తించాలన్నారు. సామాజిక ఉద్యమాలలో ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసిన మాలలను ఉద్దేశపూర్వకంగా కించపరచటం సరైనదికాదన్నారు. దీనిని మాలమహానాడు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా మాలలు, మాల మేధావులు, రాజకీయ నాయకులు, సామాజిక ఉద్యమకారులు అంతా ఏకమై అస్తిత్వ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. లేదంటే మాలల ఉనికి ప్రమాదంలో పడుతుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒకచోట కలిసి సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. వారందరూ ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఆనాడు 2000 సంవత్సరంలో 65 మంది విద్యార్థులు పదిచదవగా 55 మంది పాల్గొనడం ఆనందాన్ని, ఉత్సవాన్ని నింపిందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

- స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు



జాతరలో వెలసిన రంగుల రాట్నాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం సెలవుదినం కావటంతో పెద్దసంఖ్యలో ప్రజలు స్వామివారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో వెలసిన పలు తినుబండరాల మిఠాయి దుకాణాలు, ఆట వస్తువుల, గాజుల దుకాణాలతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలతో చేవెళ్ల సందడిగా మారింది. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. జాతరలో భక్తులకు ఇబ్బంది లేకుండా దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తుల సందడి